మాతృత్వ మరణాలు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో మాతృత్వ మరణాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మాతృత్వ మరణాల నియంత్రణపై శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మాతృ మరణాలు నిరోధించడానికి తన అధ్యక్షతన సంబంధిత అధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. దీపావళి పండగ తర్వాత ఈ కమిటీ ఆధ్వర్యంలో హైరిస్క్ గర్భిణుల జాబితాను సిద్ధం చేసి వారికి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. డీఎం హెచ్ఓ రాజేందర్, జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకుడు సురేశ్, వైద్యాధికారులు సౌమ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మల్: కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ-27లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ ఎత్తిపోతల పథకం పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నీటి పారుదలశాఖ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పనుల పురోగతిపై చర్చించారు. ఎస్ఈ రవీందర్, ఈఈ అనిల్, డిప్యూటీ ఈఈ నరేష్‌కుమార్, ఏఈఈలు మిరాజ్‌ఉద్దీన్, గంగాధర్ పాల్గొన్నారు.


రక్తదాతలు దైవంతో సమానం


రక్తదానం చేస్తున్న డీఎస్పీ గంగారెడ్డి, ఇతర పోలీసులు, పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి అవసరమైన రక్తం అందించే వారు దైవంతో సమానమని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్మల్‌లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరుల త్యాగఫలితంగానే స్వేచ్ఛ, ప్రశాంతతను అనుభవించగల్గుతున్నామన్నారు. దీర్ఘకాల జబ్బులతో బాధపడుతున్నవారికి, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి రక్తం అవసరమవుతుందని చెప్పారు. ఎదుటివ్యక్తి దానం చేస్తే తప్ప రక్తం ఇతరులకు అందించలేమని గుర్తించాలని కోరారు. రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ వారికి పండ్లు, పానీయాలు అందించారు. డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, నవీన్‌కుమార్, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే మద్దతు ధర

ఈనాడు ఫోన్-ఇన్‌లో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కిరణ్‌కుమార్



నిర్మల్, న్యూస్‌టుడే:

జిల్లాలో వరి కోతలు పూర్తయిన ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నాం. కేంద్రాల్లో అన్నదాతలకు ఇబ్బందులు రానీయకుండా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ముందస్తుగా అన్ని చర్యలు తీసుకున్నాం. నాణ్యత ప్రమాణాలు పాటించి కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే వెంటనే కొనుగోలు చేయడంతో పాటు మద్దతు ధర లభిస్తుందని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో సందేహాలపై 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'ఫోన్-ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రైతుల ప్రశ్నలకు ఆయన పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు గోపాల్‌తో కలిసి సమాధానాలిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఆ వివరాలు

? ఖానాపూర్ మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకొచ్చి పది రోజులైనా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదు. తాగునీరు లేదు.. పందుల సంచారంతో ధాన్యం రక్షణకు రాత్రుల్లో జాగారం చేస్తున్నాం.

- బోరువంతుల నాగేశ్, ఖానాపూర్, రామిడి మహేశ్, తర్లపాడు, ఖానాపూర్ మండలం

✓ పీఏసీఎస్ ఆధ్వర్యంలో త్వరలోనే కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తాం. నీడ కోసం షెడ్లు వేయిస్తాం. రాత్రి సమయంలో వాచ్‌మెన్‌ను ఉండేలా చూస్తాం.

? తరుగు, తేమ, తాలు పేరిట కొనుగోలు కేంద్రాల్లో గతంలో బస్తాకు 2–3 కిలోల కోత విధించారు. రైస్‌మిల్లుల్లోనూ మరో 2 కిలోలు తగ్గించారు. ఈ సారి అలా జరగకుండా చర్యలు తీసుకోవాలి.

- తోట రఘుపటేల్, కుంటాల, వెంకటేశ్, కొత్త మద్దిపడగ, కడెం మండలం, సయ్యద్‌కలీం, నర్సాపూర్(జి).

✓ ఈసారి అలా జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యం తీసుకొస్తే కోత ఉండదు. ఈ సారి ప్రత్యేకంగా మండల, జిల్లాస్థాయి స్క్వాడ్ బృందాలు పరిశీలనకు వస్తాయి. ఎక్కడైనా మోసం చేస్తున్నారని తెలిస్తే సంబంధిత కేంద్రాల నిర్వాహకులను తొలగిస్తాం. రైస్ మిల్లుల్లోనే తరుగు తీయకుండా ఒక ప్రత్యేక బృందం పరిశీలిస్తుంది.

? సన్నరకాలను ఎలా గుర్తిస్తారు?

- చిన్నయ్య, రాజురా, సాయి, రాయపూర్-కాండ్లి, లోకేశ్వరం మండలం

✓ ప్రభుత్వ సూచించిన మేరకు 33 సన్న రకాల ధాన్యం కొనుగోలు చేస్తాం. ప్రతికొనుగోలు కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రో మీటరు) యంత్రం అందజేస్తున్నాం. దాంతో సన్నరకం గింజ పొడువు, వెడల్పు కొలుస్తారు. పొడువు 6 మి.మీ. వెడల్పు 2 మి.మీ. కంటే తక్కువ ఉండాలని ప్రమాణాలు నిర్దేశించారు.

? సన్నరకాలకు ప్రకటించిన బోనస్ ఎప్పుడిస్తారు.. డబ్బులు ఎప్పుడు జమ చేస్తారు?

- సాగర్, చాక్‌పల్లి, కుంటాల మండలం

✓ ధాన్యం క్వింటాలు మద్దతు ధర గ్రేడ్-1కు రూ. 2,320, కామన్ రకానికి రూ.2,300 ఉంది. ఈ డబ్బులతోపాటు సన్నరకాల ధాన్యం క్వింటాలుకు రూ. 500 ఇస్తాం. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిర్వాహకులు వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేస్తారు. 48 గంటల్లోగా రైతు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.

? వరి పండించిన రైతులు వరుస వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యంలో నిర్దేశిత తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయడం లేదు

- జీవన్‌రావు, ఆలూరు, సారంగాపూర్ మండలం.

✓ నాణ్యత ప్రమాణాలు పాటించి కేంద్రానికి ధాన్యం తీసుకొస్తే వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం. తేమ ప్రమాణాల ప్రకారం ఉన్నా కొనుగోలు చేయకుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. ఈ సారి రైస్‌మిల్లుల్లో కాకుండా గోదాముల్లో ధాన్యం నిల్వ చేస్తున్నాం. అక్కడ గోదాము ఇన్‌ఛార్జి ధాన్యం వివరాలు నమోదు చేసుకుంటారు. ధాన్యం కొనుగోళ్లు, డబ్బుల చెల్లింపులో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

? సన్న, దొడ్డు రకాలు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేస్తారా..

- కోల అశోక్, ఇలేగాం, భైంసా మండలం, సాయిప్రసాద్, ముథోల్

✓ వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒకే దగ్గర ఉంటే ఇబ్బందులు ఏర్పడతాయి. సంబంధిత ఏఈవో సన్నరకానికి ధ్రువీకరణ పత్రం ఇస్తారు. దీని ఆధారంగా కొనుగోలు చేస్తాం.

? కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాల్లో తేడాలు, ఇబ్బందులు, ఇతరత్రా సమస్యలు తెలపడానికి ఏదైనా నెంబరు ఉందా?

-రాజారెడ్డి, చిట్యాల్, నిర్మల్ మండలం.

✓ ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. కేంద్రాల్లో రైతులు ఏవైనా ఇబ్బందులు పడితే కంట్రోల్ రూం 63056 46600 నెంబరులో సంప్రదించాలి.

? సన్న రకాలకు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.3,500 ధర ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే రూ.2,800 మాత్రమే వస్తుంది. దొడ్డు రకాలకు బోనస్ ఇస్తేనే రైతుకు ప్రయోజనం ఉంటుంది.

- ఏనుగుల రాజేశ్వర్, పాత ఎల్లాపూర్, ఖానాపూర్ మండలం

✓ ప్రభుత్వం సన్న రకాలకు మాత్రమే బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది.

రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ సయ్యద్ అర్జుమంద్‌అలీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర ఛైర్మన్ రియాజ్‌అలీ

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: సీఎం, మంత్రులు, ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, అధికారుల సహకారంతో జిల్లా గ్రంథాలయాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ సయ్యద్ అర్జుమంద్‌అలీ అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధునాతన సౌకర్యాలు, పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తానని పేర్కొన్నారు. ఏ పోటీ పరీక్ష జరిగినా ఇక్కడి అభ్యర్థులే అత్యధికంగా ఉద్యోగాలు సాధించేలా వారికి వెన్నుదన్నుగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఛాంబర్‌లో అర్జుమండ్ అలీ బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఆయనను సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, గ్రంథాలయ సంస్థ కరీంనగర్ ఛైర్మన్ సత్తు మల్లేశ్, పుర ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మాజీ ఛైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, మార్కెట్ కమిటీల ఛైర్మన్లు సోమ భీంరెడ్డి, అబ్దుల్ హాది, ఆనంద్‌రావుపటేల్, బార్ అసోసియేషన్ నిర్మల్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సి.లింగన్న, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా ఛైర్మన్ కొట్టె శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యాచరణ

సీఎం యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారని గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ రియాజ్ అలీ చెప్పారు. లైబ్రరీలు విజ్ఞానం పెంపునకు దోహదం చేస్తాయని, అలాంటి వాటిని ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అంతకుముందు ఆయన గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి


విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న డీఐఈవో పరశురాం

భైంసా, న్యూస్‌టుడే: డిసెంబరులోగా పాఠ్యాంశాలు పూర్తి చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి పరశురాం అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, బోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల రాత పుస్తకాలు పరిశీలించి, పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. గతంలో కంటే విద్యార్థుల సంఖ్య పెరిగినా హాజరు శాతం తక్కువైందని, అందరూ హాజరయ్యేలా చూడాలని ప్రిన్సిపల్ శివరంజనికి సూచించారు. అధ్యాపకులు హరిప్రసాద్, సందీప్ కులకర్ణి, భూషణ్ పాండే, సంతోశ్, సతీశ్, లావణ్య, సంగీత, చందన, బాలానందం తదితరులు ఉన్నారు.

ఈ నామ్ సర్వర్ మొరాయింపు

బహిరంగ వేలం పాటల ద్వారా సరకు విక్రయాలు


భైంసాలో బహిరంగ వేలం ద్వారా సరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

భైంసా, న్యూస్‌టుడే: సర్వర్ మొరాయించడంతో భైంసా మార్కెట్‌లో శుక్రవారం ఈ-నామ్ మార్కెట్ సేవలు నిలిచిపోయాయి. దీంతో రైతులు, వ్యాపారులు, మార్కెట్ అధికారులు మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. సర్వర్ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల అనుమతులతో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పంట ఉత్పత్తుల విక్రయాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సరకు నాణ్యతను పరిశీలించి వేలం పాటల ద్వారా కొనుగోళ్లు చేపట్టారు. వేలం పాటల్లో క్వింటాలు సోయా ధర రూ. 4,300నుంచి రూ. 4,600వరకు పలికింది. ఈ-నామ్ కంటే బహిరంగ వేలం ద్వారా మంచి ధర లభిస్తోందని కొందరు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. 290 మంది రైతులు సుమారు 2,260 క్వింటాళ్ల సరకును విక్రయించినట్లు అధికారులు పేర్కొన్నారు. మార్కెట్ ద్వితీయ శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధిష్ఠానం అన్యాయం చేస్తోంది'

భైంసా, న్యూస్‌టుడే: కష్ట పడి పనిచేస్తున్న వారికి పార్టీలో గుర్తింపు లేకుండా పోతోందని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరావు పటేల్ అనుచరులు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎంపీపీ రాంచంద్రారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, సీనియర్ నాయకుడు గోపిడి ప్రేంనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. భైంసా మార్కెట్ కమిటీ నియామకం నియోజకవర్గ బాధ్యుడైన నారాయణరావు పటేల్‌కు తెలియకుండా ఎలా చేపడతారని ప్రశ్నించారు. నామినేటెడ్ పదవుల్లో డైరెక్టర్లుగా భాజపా నాయకులను నియమించారని, సారంగాపూర్, నిర్మల్, భైంసా మార్కెట్ కమిటీల నియామకంలో పార్టీ కోసం పని చేసిన వారికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు చంద్రకాంత్, బంకబాబు, వివేకాంద్, తదితరులు పాల్గొన్నారు.

28న ఆదిలాబాద్‌కు రాష్ట్ర బీసీ కమిషన్ బృందం

నిర్మల్, న్యూస్‌టుడే: రాష్ట్ర బీసీ కమిషన్ బృందం ఈనెల 28న ఆదిలాబాద్ పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కమిషన్ ఛైర్మన్ నిరంజన్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆమె బృందం పర్యటన వివరాలను శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు. ఆదిలాబాద్‌లోని జడ్పీ సమావేశం హాలులో కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్ బృందం ఆ రోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజాభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు. నిర్మల్ జిల్లా రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను కమిషన్ బృందానికి తెలపవచ్చని సూచించారు. రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కల్పించాల్సిన రిజర్వేషన్లు, దామాషా వివరాలపై అభిప్రాయాలు సేకరిస్తుందని వెల్లడించారు. ఆసక్తి గల వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా వారికి అందించవచ్చని సూచించారు.

ఒక వైపు బెబ్బులి.. మరో వైపు గజరాజు




ఏప్రిల్ నెలలో కుమురం భీం జిల్లాకు వచ్చిన ఏనుగు

● ఉమ్మడి జిల్లావాసుల్ని వణికిస్తున్న మృగాలు

ఆవాసం కోసం, తోడు కోసం వెతుక్కుంటూ వస్తున్న పులులు సరైన గమ్యస్థానానికి చేరుకునే క్రమంలో అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నాయి. ఈ మార్గంలో మనుషులకు కనిపించడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యాఘ్రం లేదా మనిషి మృత్యువాతపడుతున్నారు. మరోవైపు ఏనుగు సైతం ప్రాణహిత నదిని దాటి కుమురం భీం జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురిని చంపేసిన ఏనుగు తెలంగాణలోకి వస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -ఈనాడు, ఆసిఫాబాద్


పులుల అభయారణ్యాల నుంచి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్ విస్తరించి ఉండగా, వీటి చుట్టూ మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి అభయారణ్యాలు ఉన్నాయి. వీటిలో ఏటా 30-40 వరకు పులి పిల్లలు జన్మిస్తున్నాయి. ఆవాసం వెతుక్కునే క్రమంలో కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా అడవులకు ఇవి వస్తున్నాయి. ఇలా వస్తున్నవి నేరుగా కవ్వాల్‌కు చేరుకోలేకపోతున్నాయి. నాలుగు వరుసల రహదారి, బొగ్గు ఉపరితల గనులు, పోడు వ్యవసాయం, ప్రాజెక్టుల నిర్మాణం వీటిని కవ్వాల్‌వైపు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నాయి.

✷ ఈ ఏడాది ఏప్రిల్‌లో కుమురం భీం జిల్లాకు వచ్చిన ఏనుగు పెంచికల్‌పేట్, చింతలమానేపల్లి మండలాల్లో ఇద్దరు రైతులను తొక్కి చంపేసింది. రెండు రోజుల అనంతరం ప్రాణహిత నదిని దాటి మహారాష్ట్ర జిల్లాలోని గడ్చిరోలి అడవులకు వెళ్లింది. ఈ ఏనుగు మహారాష్ట్రలోనే ఉన్నా, ప్రస్తుతం తెలంగాణలోని చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల వైపు వస్తుందని అటవీ అధికారులకు పొరుగు రాష్ట్ర అధికారులు సమాచారం అందించారు. వారం క్రితం గడ్చిరోలి జిల్లాలో ఓ యువకుడు ఏనుగుతో సెల్ఫీ తీసుకునే క్రమంలో సైతం ఇదే ఏనుగు తొక్కి చంపేసింది.

ఒకటి నిలకడగా ఉంది

కవ్వాల్ ఉడుంపూర్ అటవీ ప్రాంతంలో ఒక పులి నివాసం ఏర్పర్చుకోవడం పట్ల అటవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కెరమెరి మండలంలోని ఇందాపూర్ అటవీ ప్రాంతంలో ఆడ పులి సంచరిస్తుంది. పక్షం రోజుల్లో రెండు ఆవులను ఈ పులి చంపేసింది. ఈ పులి కవ్వాల్‌కు వెళితే జతకట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. తిప్పేశ్వర్ నుంచి వచ్చిన మగపులి భీంపూర్, బోథ్, సారంగపూర్ మీదుగా కవ్వాల్‌కు చేరుకుంటుందా లేదా అని కొద్ది రోజుల్లో తెలిపోతుంది.



ఏనుగు కదలికలపై అప్రమత్తంగా ఉన్నాం

నీరజ్‌కుమార్, కుమురంభీం జిల్లా అటవీ శాఖ అధికారి

ప్రాణహిత నది సమీపంలో తెలంగాణ చింతలమానేపల్లి మండల అటవీ ప్రాంతానికి 30-35 కిలోమీటర్ల దూరంలో ఏనుగు సంచరిస్తోంది. డ్రోన్ కెమెరాలతో ఈ ఏనుగును నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రాణహిత నదీ తీరం వెంబడి ఉన్న బెజ్జూర్, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాల ఆయా గ్రామాల ప్రజలు రాత్రి ఆరు గంటల అనంతరం ఎవరు పంటచేల వద్దకు వెళ్లవద్దు.

జత కోసం వెతుకులాట..

న్యూస్‌టుడే, బోథ్ :

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో మూడు రోజులుగా తిరుగుతున్న పెద్దపులి.. గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో ప్రత్యక్షమైంది. పశువులపై దాడిచేసి చంపుతుండటంతో రెండు మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ సిబ్బందికి నాలుగు రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. దాదాపు 20 మంది బేస్ క్యాంపు సిబ్బంది పులి జాడ కోసం అడవిని జల్లెడ పడుతున్నారు. ఇది మగ పులిగా అటవీ సిబ్బంది నిర్ధారించారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం సైతం తన తోడును వెతుక్కుంటూ మహారాష్ట్ర నుంచి బోథ్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోకి వచ్చిందని భావిస్తున్నారు. తోడును వెతుక్కునే క్రమంలో కంటికి కనిపించిన పశువులపై కోపంతో దాడి చేసి చంపుతోంది. బుధవారం చింతగూడ అటవీ ప్రాంతంలో ఎద్దుపై దాడి చేసి చంపింది. కానీ మాంసాన్ని మాత్రం తినలేదు.

తిప్పేశ్వర్ నుంచి..

-పుండలిక్, ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్వో, బోథ్

బోథ్ మండలం వజ్జర్, చింతగూడ అటవీ ప్రాంతంలో వ్యాఘ్రం సంచరిస్తుందనే మాట వాస్తవమే. రెండు రోజులుగా పులి కదలికలను గమనించాం. తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుంచి భీంపూర్ మీదుగా బోథ్ మండలంలోని వజ్జర్ అటవీ ప్రాంతానికి వచ్చింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అటవీ ప్రాంతానికి వెళ్లొద్దు. పశువులను తీసుకెళ్లొద్దు.

?: నిర్మల్‌లోని మినీట్యాంక్‌బండ్‌పై రెండు వరుసల సీసీ రోడ్డులో ఒక వైపు పలు చోట్ల పగుళ్లు చూపి గుంతలు పడింది. దీంతో ఒక వైపు రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. - ఎం.నవీన్, స్థానికుడు


మినీ ట్యాంక్‌బండ్‌పై దెబ్బతిన్న సీసీ రోడ్డు

✓ పరిశీలించి, మరమ్మతులు చేపడుతాం. –న్యూస్‌టుడే, నిర్మల్‌గ్రామీణం
- సీవీఎన్ రాజు, పుర కమిషనర్, నిర్మల్

? తానూరు మండలం భోసి గ్రామంలో వివేకానంద విగ్రహం సమీపంలో ప్రధాన రహదారి కల్వర్టుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది.
- శ్రీనివాస్ యాదవ్, భోసి

✓ వెంటనే పూడ్చివేస్తాం.
- రవికుమార్, పంచాయతీ కార్యదర్శి, భోసి


భోసిలో ప్రధాన రహదారిపై కల్వర్టుపై ఏర్పడ్డ గుంత

–న్యూస్‌టుడే, భైంసా

చెరువులో పడి యువకుడి మృతి

కుభీరు, న్యూస్‌టుడే: తానూరు మండలం ఎల్వత్ గ్రామానికి చెందిన అవదూత్ రాజరత్న(22) కుభీరు మండలం సాంవ్లీ చెరువులోపడి మృతిచెందారు. మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. రాజరత్న నాలుగు రోజుల క్రితం మండలంలోని సాంవ్లీ గ్రామంలోని పెద్దమ్మ సరోజ ఇంటికి వచ్చారు. వరుసకు అన్నయ్య అయ్యే సందీప్‌తో కలిసి గురువారం పంటచేనులో సోలార్ విద్యుత్తు కంచె ఏర్పాటుకు కర్రలు తేవడానికి చెరువు గట్టుకు వెళ్లారు. కట్టెలు కొట్టి వాటిని కుప్పగా వేశారు. అదేరోజు సాయంత్రం చెరువులో స్నానం కోసం రాజరత్న ఒక్కడే వెళ్లి నీటమునిగి కనిపించకుండా పోయారు. దీంతో సందీప్ తోటి రైతులతో కలిసి యువకుడి కోసం వెతికినా జాడ దొరకలేదు. శుక్రవారం చెరువులో వెదకగా మృతిచెంది కనిపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

చోరీ

నిర్మల్ గ్రామీణం: మండలంలోని చిట్యాల్ గ్రామంలో లైటింగ్ షాపింగ్ షట్టర్‌ను గురువారం రాత్రి దొంగలు పగులగొట్టి 6 ఆంప్లీఫైర్లు ఎత్తుకెళ్లినట్లు నిర్మల్ గ్రామీణ ఎస్సై లింబాద్రి శుక్రవారం తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

తానూరు(భైంసా): మండలంలోని మొగిలి గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి అక్రమంగా అమ్ముతున్న మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్సై డి.రమేశ్ తెలిపారు. రూ.24వేలు విలువచేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నిర్మల్ గ్రామీణం: నిర్మల్ గ్రామీణ మండలం రాణాపూర్‌లో 20 లీటర్ల గుడంబాను శుక్రవారం రాత్రి నిర్మల్ గ్రామీణ పోలీసులు ధ్వంసం చేశారు. డయల్ 100కు అందిన సమాచారంతో గ్రామానికి వెళ్లి గుడంబా స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డయల్ 100ను వినియోగించుకోండి

భైంసా గ్రామీణం: డయల్ 100పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా భైంసా గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని గ్రామీణ సీఐ ఎం.నైలు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పోలీసుల విధులు, ఆయుధాల వినియోగం, బాంబ్ స్క్వాడ్, షీ టీం, ఇతర సాంకేతిక పరికరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై జి.శ్రీనివాస్ యాదవ్, ఏఎస్సై మారుతి, పోలీసులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న ఏఎస్పీ అవినాష్ కుమార్

2 నుంచి మస్కాపూర్‌లో యోగా పోటీలు

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 2వ తేదీ నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్ రావు తెలిపారు. క్రీడల నిర్వహణ సమాఖ్య కార్యదర్శి అమరవేణి రవీందర్‌గౌడ్ శుక్రవారం పాఠశాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. నాలుగు జిల్లాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతారని, వారికి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంకు సూచించారు.

దండారి సందడి షురూ..

దస్తూరాబాద్, న్యూస్‌టుడే: ఆదివాసీ గూడేల్లో దండారి (దీపావళి) సందడి మొదలైంది. దీపావళి ఆదివాసీలకు అతి పెద్ద పండుగ. ఈ సందర్భంగా ఆదివాసీలు ఆషాఢ మాసం పౌర్ణమి రోజున ఏత్మాసార్ దేవుడి పూజలతో ఆరంభించి ఆశ్వయుజ మాసం అమావాస్య వరకు వేడుకలు జరుపుతారు. శుక్రవారం మండలంలోని మున్యాల్, రేవోజిపేట, గోడిసిర్యాల, పెర్కపల్లి, మల్లాపూర్, బుత్తాయిగూడ, ఆకొండపేట ఆదివాసీ గూడేల్లో వారు సిద్ధం చేసుకున్న సామగ్రిని ఆ గూడెం గ్రామ పటేల్ ఇంటి ఆవరణలో ఉంచి సంప్రదాయ పూజలు చేసి దండారి ఉత్సవాలను ప్రారంభించారు.


దస్తూరాబాద్‌లో దండారి భోగీ పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఘనంగా భీమన్న జాతర

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలో భీమన్న జాతర శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయం చెంత బండారు బాసింతం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆలయ ఎదుట జెండాను ఆవిష్కరించి పూజలు ప్రారంభించారు. ఖానాపూర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు తరలివచ్చి భీమన్నదేవుడి దర్శనం చేసుకున్నారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జాన్సన్‌నాయక్ భీమన్న దేవుడిని దర్శించుకున్నారు.


ఆలయం చుట్టూ భక్తుల ప్రదక్షిణలు

భీం ఆశయ సాధనకు కృషి

కుభీరు: నిజాం పాలకులతో పోరాడి మనకు హక్కులు చట్టాలు కల్పించిన కుమురంభీం ఆశయ సాధనకు కృషిచేయాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఆదివాసీ నాయకపోడ్ 'సేవాసంఘం' సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన కుమురంభీం విగ్రహానికి ఆదివాసీ నాయకపోడ్ సంఘం ప్రతినిధులు నివాళులు అర్పించారు. అనంతరం తిరిగే కల్యాణ మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం కుభీర్ అధ్యక్షుడు ముచ్చిడ్ విఠల్, జిల్లా అధ్యక్షుడు పోతినేని శంకర్, రాజయ్య, అశోక్, సునీల్‌కుమార్, భీముడు, రాంచందర్ పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ పట్టణం: తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పలు వైద్య ఉద్యోగాలను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణాధికారి డా.బి.సురేశ్ తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను నవంబరు 5న ఉదయం 10 గంటలకు జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షణాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎంపికైన ముఖాముఖి అదే రోజు సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యా

సహ్యాద్రిలో చిరుత సంచారం

● భయాందోళనలో పరిసరాల గిరిజనులు

సారంగాపూర్, న్యూస్‌టుడే: సారంగాపూర్ మండలం రవీంద్రనగర్ సమీపంలోని సహ్యాద్రి కొండల్లో గురు, శుక్రవారాల్లో చిరుతపులి సంచరించింది. తొలుత పెద్దపులా, చిరుతపులా అని సందిగ్ధం నెలకొన్నా శుక్రవారం సాయంత్రం ఆడెల్లితండా సమీపంలో ఒక ఎద్దు, రెండు గొర్రెలపై దాడిచేయడాన్ని ప్రత్యక్షంగా చూసిన మోహన్ అనే వ్యక్తి తెలిపిన సమాచారంతో అధికారులు అది చిరుతేనని నిర్ధారణకు వచ్చారు. అయితే గురువారం కొట్టం(బి) సమీపంలోని కర్రి ప్రాంతంతో పాటు రవీంద్రనగర్ శివారులో చిరుత సంచారం స్థానికులు గుర్తించారు. రవీంద్రనగర్‌కు చెందిన మేకల కాపరి జోగినరి సాయేందర్ తన మేకలను జామ్ అటవీక్షేత్రంలో జీవాలను మేతకు తీసుకెళ్లారు. చిరుతను చూసిన జీవాలు సాయేందర్ వద్దకు పరుగులు తీస్తూ వచ్చాయి. చిరుత సమీపానికి రావడాన్ని గమనించిన సాయేందర్ చెట్టుపైకి ఎక్కాడు. చెట్టుకింద ఉన్న మేకపై అది దాడి చేయడంతో సాయేందర్ గట్టిగా కేకలు వేయడంతో దాన్ని వదిలిపెట్టి వెళ్లింది. ఆ వెంటనే మేకలు పరుగులు పెట్టాయి. తరువాత అందులోని మరో రెండింటిపై దాడిచేసి హతమార్చినట్లు సాయేందర్ చెప్పారు. ఆయన ఇచ్చిన సమాచారంతో శుక్రవారం సారంగాపూర్ ఉప అటవీ అధికారి మహ్మద్ నజీర్‌ఖాన్, ఎఫ్ఎస్‌వో రషీద్ నేతృత్వంలో మూడు బృందాలు రవీంద్రనగర్, బీరవెల్లి, ఆయా పరిసరాలు, సిరిపల్లి-ఆడెల్లి అటవీ ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. ఎక్కడా చిరుత సంచారం ఆనవాళ్లు కనిపించ లేదు. అయితే సాయంత్రం ఆడెల్లితండా సమీపంలో ఆడెల్లి మోహన్ ఎద్దు, జాదవ్ అశోక్‌కు చెందిన రెండు జీవాలపై చిరుత దాడి చేసి గాయపరిచింది. చిరుత దాడి విషయం తెలుసుకున్న నిర్మల్ డీఎఫ్‌వో నాగినిబాను ఆడెల్లి తండాను సందర్శించారు. చిరుత దాడిలో గాయపడిన వాటిని పరిశీలించారు. బాధిత రైతులు, గ్రామస్థులతో మాట్లాడారు. ఒంటరిగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లొద్దని సూచించారు. చిరుతను పట్టుకునే ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఆమె వెంట ఎఫ్ఆర్వో రామకృష్ణ, ఎఫ్ఎస్‌వో రషీద్, అటవీశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.


చిరుత దాడిలో తీవ్రంగా గాయపడిన ఎద్దు


గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో నాగినిబాను, అటవీశాఖ అధికారులు

భక్తులూ.. జాగ్రత్త

చిరుత దాడి చేసిన ప్రాంతం అడెల్లి మహా పోచమ్మ ఆలయానికి కిలోమీటరు దూరంలోనే ఉంది. ఆలయ పరిసరాలను ఆనుకొని అటవీ శాఖ నందనవనంలో భక్తులు భోజనాలు చేస్తుంటారు. ఈ వనంలోకి చిరుత సులువుగా వచ్చే అవకాశాలున్నందున భక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ఆదర్శ గ్రంథాలయాలు ప్రారంభం

మామడ, న్యూస్‌టుడే: మండల స్థాయి ఆదర్శ గ్రంథాలయాన్ని మండలంలోని కొరటికల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేశారు. దీనిని ఎంఈవో వెంకటరమణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అందుబాటులో ఉన్న అనేక పుస్తకాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, రూమ్ టు రీడ్ మండల సమన్వయకర్త శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలి

దిలావర్‌పూర్: విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే వివిధ పుస్తకాల పఠనం చేయించాలని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రూమ్‌టూ రీడ్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 750 వివిధ పుస్తకాలతో ఏర్పాటు చేసిన మండల ఆదర్శ గంథ్రాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. మండల కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం, ప్రధానోపాధ్యాయులు సాయికిరణ్, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్‌పర్సన్ లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుభీరు: మండలంలోని మాలేగామ్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూరీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన ఆదర్శ గ్రంథాలయాన్ని మండల విద్యాధికారి విజయ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షురాలు రజిత, ప్రధానోపాధ్యాయుడు అనురథ్, ఉపాధ్యాయురాలు రజిత, సీఆర్పీ రవీందర్, సంస్థ ప్రతినిధి రాము పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

సద్వినియోగం చేసుకోండి

ముథోల్: గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శివకుమార్ అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీఓ శివకుమార్ ముథోల్‌లోని ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఎంఈఓ రమణారెడ్డి, కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుస్రు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ పాల్గొన్నారు.

అసలే మూలమలుపులు.. ఆపై అడ్డుగా పిచ్చి మొక్కలు

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఖానాపూర్ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ శివారు దిలావర్‌పూర్ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మండలంలోని దిలావర్‌పూర్, గోసంపల్లె, గోడలపంపు, కొత్తపేట్, బావాపూర్(కె), పాత ఎల్లాపూర్‌తో పాటు కడెం మండలానికి చెందిన కొన్ని గ్రామాల ప్రజలు ఈ దారిగుండా ప్రయాణిస్తుంటారు. ఎల్లప్పుడూ ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. దారి పొడవునా అక్కడక్కడ ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడమే కాకుండా మూలమలుపులు అధికంగా ఉండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు పొంచి ఉన్నాయి. అసలే ఇరుకు రోడ్డు, ఆపై మూలమలుపుల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు అకస్మాత్తుగా కనబడటంతో వాహన చోదకులు నియంత్రణ కోల్పోతున్నారు. వేగంగా వచ్చే వాహనాలను తప్పించుకోవడానికి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగింపజేయాలని కోరుతున్నారు.


కొత్తపేట్-బావాపూర్(కె) మార్గంలో మూలమలుపు వద్ద పరిస్థితి ఇలా..

పుస్తకాలు వరుస పెట్టాల్సిందే!

ప్లాస్టిక్ కవర్లు, వాటిలో తపాలా పాస్ పుస్తకాలు, అవి గాలికి లేచి పోకుండా బండ రాళ్లు పెట్టి పక్కన అంత మంది ఎందుకు నిరీక్షిస్తున్నారని సందేహం మెదలుతుంది కదూ.. ఆసరా పింఛన్ డబ్బులు పొందటానికి వరుసలో నిలబడలేక లబ్ధిదారులు ఇలా పుస్తకాలను వరుసపెట్టారు. కుభీరులో 2200 మంది ఆసరా లబ్ధిదారులు ఉన్నారు. వారికి తపాలా కార్యాలయంలో పింఛన్ డబ్బులు అందిస్తున్నారు. శుక్రవారం అంతర్జాలం సేవలు అందక లబ్ధిదారులు పింఛన్ చెల్లింపులు నిలిచిపోవడంతో పాసుపుస్తకాలను వరుసలో ఉంచి చెట్టునీడలో నిరీక్షించారు. ఒకే తపాలా అధికారి ఒక్కటే యంత్రంతో ఆసరా డబ్బులు అందించటంతో పంపిణీలో ఆలస్యం అవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు.


కుభీరులో పింఛన్ డబ్బుల కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

- న్యూస్‌టుడే, కుభీరు

ప్రాంగణమిలా.. ఆటలాడేదెలా?

గ్రామీణ యువతలో క్రీడానైపుణ్యం వెలికి తీయడానికి గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. చాలా గ్రామాల్లో క్రీడల నిర్వహణకు స్థలాల సేకరణ సరిగా చేయలేదనే విమర్శలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో మైదానాలు సరిగా లేకపోగా, మరికొన్ని ప్రదేశాల్లో చెరువుల్లో ఏర్పాటు చేశారు. దీంతో ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయింది. లక్ష్మణచాంద మండలం కనకాపూర్‌లో చెరువు పక్కనే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో నీటిలో ఆటలు ఆడే వీల్లేకుండా పోయింది. మైదానంలోనే గుంత తవ్వారు.

చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్


చెరువు నీటి పక్కనే వ్యాయామ పరికరాలు

సంక్షిప్త సమాచారం

నేడు ముథోల్ బంద్‌కు పిలుపు

ముథోల్: ఇటీవల హైదరాబాద్‌లో దేవాలయాలపై జరిగిన దాడికి నిరసనగా ముథోల్ ఉత్సవ కమిటీ, హిందూ వాహిని ఆధ్వర్యంలో శనివారం ముథోల్ బంద్ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

ముథోల్: ముథోల్, తానూర్ మండలాల ప్రైవేట్ పాఠశాలల(ట్రస్మా) కార్యవర్గాన్ని ముథోల్‌లో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అసంవార్ సాయినాథ్, ఉపాధ్యక్షుడిగా ఎ.రమేష్, ప్రధానకార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా విశ్వనాథ్, ఎన్నికల కమిషన్ సభ్యులుగా అరవింద్ రెడ్డి, నర్సయ్య, సుభాష్, నజీబ్‌ఖాన్‌లు ఎన్నికయ్యారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసా గ్రామీణం: మండలంలోని కామోల్‌లో డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మిర్జాపూర్ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు అమెడ దేవేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

ఏఎంసీ ఛైర్మన్‌కు సన్మానం

కుంటాల: మండలంలోని కల్లూరు శ్రీదత్తవెంకటసాయి ఆలయంలో శుక్రవారం భైంసా ఏఎంసీ ఛైర్మన్ సింధే ఆనంద్‌రావుపటేల్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఆలయ సమితి సభ్యులు గంగాధర్ పటేల్, సుదర్శన్‌గౌడ్, సుదర్శన్‌పటేల్, నాయకులు రాజన్న, లింగురాం పటేల్, దిగంబర్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆహ్లాదకర వాతావరణం

కుంటాల: స్వచ్ఛతతోనే గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుందని ఎంపీడీఓ తాటికొండ లింబాద్రి అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా కుంటాలలో శుక్రవారం ఇంటి పరిసరాలను పరిశీలించి సూచనలు చేశారు. ఆర్ఐ అడెల్లు, ఎంపీఓ అబ్దుల్ రహీం, కార్యదర్శి రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం

నిర్మల్ పట్టణం: విభిన్న దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక టీఎన్జీఓ భవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.లక్ష్మారెడ్డి, అథర్ తెలిపారు. సభ్యులంతా సకాలంలో పాల్గొనాలని, సంఘ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు- సూచనలు అందజేయాలని కోరారు.

మహా సమ్మేళనం జయప్రదం చేయండి

నిర్మల్ అర్బన్: హైదరాబాద్‌లో నవంబరు 3న నిర్వహించనున్న ధర్మసమాజ్ పార్టీ మహా సమ్మేళనం విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు కోరారు. శుక్రవారం నిర్మల్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు రవీందర్, రాజు, భూమేశ్, శేఖర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో నిఘానేత్రాలు

నర్సాపూర్(జి): మండలంలోని డొంగుర్‌గాం గ్రామస్థులు సిద్ధేశ్వర ఆలయంలో శుక్రవారం 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో హనుమాన్ మందిరంలోనూ 4 సీసీ కెమెరాలను చేశారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్: బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డీవోటీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు అన్నారు. శుక్రవారం నిర్మల్‌లో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. వేతన, పింఛన్ సవరణ వెంటనే పరిష్కరించాలన్నారు. 4జీ, 5జీ సేవలను ప్రారంభించాలని, ఒప్పంద కార్మికులకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని పేర్కొన్నారు. అసోసియేషన్, బీఎస్ఎన్ఎల్ ఈయూ సభ్యులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

నిర్మల్ అర్బన్: నిర్మల్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. 28న పట్టణంలో ర్యాలీ నిర్వహించి సభలు ప్రారంభిస్తామని చెప్పారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే పసిగట్టాలి

భైంసా, న్యూస్‌టుడే: మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని స్త్రీ వైద్య నిపుణురాలు డా.స్నేహారెడ్డి అన్నారు. పట్టణంలోని గురుకృప వృత్తి విద్య కళాశాలలో శుక్రవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ బారిన పడటానికి కారణాలు, వాటి లక్షణాలు వివరించి, ప్రాథమిక దశలోనే పసిగడితే చికిత్సల ద్వారా వెంటనే నయం చేసుకోవచ్చన్నారు. కళాశాల డైరెక్టర్ ప్రసన్నరాణి, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


రొమ్ము క్యాన్సర్ గురించి వివరిస్తున్న డా.స్నేహారెడ్డి

చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమకు వెళ్లకుండా ఆంక్షలు

● గుండంపల్లి రైతులకు అడ్డుకున్న పోలీసులు

దిలావర్‌పూర్, మరికల్ కూడలి, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్‌లో ఏర్పాటు చేసిన ఇథనాల్ పరిశ్రమను క్షేత్రస్థాయిలో పరిశీలనకు శుక్రవారం బయలుదేరిన దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామస్థులను 20 కి.మీ. దూరంలో మరికల్ ఠాణా వద్ద పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపించారు. దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమతో భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు ఉంటాయా అనే పరిశీలనకు చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమ వద్దకు గురువారం రాత్రి గుండంపల్లి నుంచి రెండు ప్రైవేటు బస్సుల్లో 80 మంది అన్నదాతలు బయల్దేరారు. చిత్తనూర్ వెళ్లడానికి అనుమతులు లేవని పోలీసులు వారిని వెనక్కి పంపారు. ఇథనాల్ పరిశ్రమలతో ప్రజలకు ఎలాంటి హాని ఉండదని అంటున్న అధికారులు, పరిశ్రమ చూసేందుకు వెళ్తున్న రైతులను ఎందుకు ఆపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను వెనక్కి పంపడంపై చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నిరసన వ్యక్తం చేసింది.



మరికల్‌లో ఆందోళన చేస్తున్న గుండంపల్లి గ్రామస్థులు

మోతాదు మించి యూరియా వాడొద్దు

లోకేశ్వరం: రైతులు తాము సాగు చేసే పంటలలో సిఫార్సు చేసిన మోతాదును మించి యూరియాను వాడితే లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉంటాయని ముథోల్ ఏరువాక వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్తలు నర్సయ్య, విజయ్‌కుమార్, కార్తిక్ సూచించారు. శుక్రవారం లోకేశ్వరంలోని రైతు వేదిక భవనంలో జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముథోల్ ఏడీఏ వినయ్‌బాబు, స్థానిక ఏఈఓలు మౌనిక, భూమేశ్ పాల్గొన్నారు.

ఆ విద్యార్థికి ధ్రువపత్రాలు అందజేయండి: హైకోర్టు

ముథోల్, న్యూస్‌టుడే: బోధన రుసుము పెండింగ్ పేరిట తనకు విద్యార్హతల ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని ఆర్జీయూకేటీలో చదువు పూర్తయిన ఫణికుమార్ అనే విద్యార్థి ఈనెల 22న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఆర్జీయూకేటీ అధికారులకు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం నాటి విచారణలో విద్యార్థి బోధన రుసుము ప్రభుత్వమే చెల్లించాల్సి ఉందని హైకోర్టుకు సంబంధిత అధికారులు చెప్పారు. దీంతో విద్యార్థి ఎలాంటి బకాయిలు లేనందున సోమవారం వరకు ఆయనకు ధ్రువపత్రాలను అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. వాటిని తాను పొందినట్లు మంగళవారం హైకోర్టుకు తెలియజేయాలని తనకు సూచించిందని విద్యార్థి ఫణికుమార్ 'న్యూస్‌టుడే'కు చరవాణిలో తెలిపారు. ఏడాదిన్నర నుంచి అధికారులను ఎంత ప్రాధేయపడ్డా ఎవరూ స్పందించలేదని, బోధనరుసుము చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సూచించారని బాధిత విద్యార్థి వాపోయారు. హైకోర్టును ఆశ్రయిస్తే తనకు న్యాయం జరిగిందని చెప్పారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఉపకులపతి గోవర్ధన్‌ను వివరణ కోరగా, హైకోర్టు ఆదేశాలను పాటిస్తామని చెప్పారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

లక్ష్మణచాంద: కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు నిర్వహించాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీంరెడ్డి అన్నారు. మండలంలోని వడ్యాల్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాన్ని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఈటెల శ్రీనివాస్, డీసీసీబీ వైస్‌ఛైర్మన్ రఘునందన్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కేంద్రం నిర్వాహకుడిపై ఫిర్యాదు

లక్ష్మణచాంద: వడ్యాల్ డీసీఎంఎస్ కేంద్రం నిర్వాహకుడు నవీన్‌రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ జానకి తెలిపారు. వడ్యాల్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి సంబంధించి అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా కేంద్రం ప్రారంభించటంపై నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పోలీసు ఉద్యోగులకు వ్యాసరచన పోటీలు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై స్థాయి వరకున్న వారికి 'సమాజంలో పోలీసు ప్రతిష్ఠను మెరుగుపర్చడంలో పోలీసుల పాత్ర' అనే అంశంపై, ఎస్సై- ఆపైస్థాయి అధికారులకు 'దృఢమైన శరీరంలో దృఢమైన మనస్సు' అనే అంశంపై ఈ పోటీ చేపట్టారు. పలువురు ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో ఉత్తమంగా ఉన్న ముగ్గురిని ఎంపికచేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు.


పోటీలో పాల్గొన్న పోలీసు అధికారులు, ఉద్యోగులు

గతుకులమయంగా గట్టు మైసమ్మ మార్గం

భైంసా, న్యూస్‌టుడే : పట్టణంలోని కుంటా ప్రాంతం గుండా గట్టు మైసమ్మ ఆలయానికి వెళ్లే రహదారులన్నీ దెబ్బతిన్నాయి. కొంత కాలం క్రితం మిషన్ భగీరథ అంతర్గత పైప్‌లైన్ పనుల తవ్వకాలతో దెబ్బతిన్న సీసీ రహదారులను సంబంధిత అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు చేపట్టడంతో అనతి కాలంలోనే గుంతలమయంగా మారాయి. రాత్రుల్లో ద్విచక్రవాహనదారుల, బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై కమిషనర్ బి.రాజేశ్‌కుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేపడుతామని తెలిపారు.


గట్టు మైసమ్మ మార్గంలో దెబ్బతిన్న సీసీ రహదారి

సమస్యలు పరిష్కరించాలని ల్యాబ్‌టెక్నీషియన్ల వినతి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రైవేటు ల్యాబ్ టెక్నీషియన్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సంఘ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు శుక్రవారం విన్నవించారు. ఇటీవల ప్రకటించిన ఉద్యోగ ప్రకటనలో తమకు అర్హత మార్కులు ఇవ్వలేదన్నారు. పొరుగుసేవల విధానంలో పనిచేస్తున్న వారికి రెగ్యులర్ వారితో సమానంగా వెయిటేజీ మార్కులు ఇవ్వకపోవడం వల్ల నష్టపోతామని చెప్పారు. అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు మిట్టపల్లి రమేశ్, నిర్మల్‌కు చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల హన్మంతు, నాయకులు చిరంజీవి, సంతోశ్‌కుమార్, జగదీశ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


ముళ్లపొదలను పొక్లెయిన్‌తో తొలగింపజేస్తున్న మాజీ సర్పంచి భుజంగ్‌రావు

ముళ్లపొదల తొలగింపు

లోకేశ్వరం: మండలంలోని హవర్గ నుంచి లోకేశ్వరం వైపు వెళ్లే మార్గంలో రహదారి పక్కన ఏపుగా పెరిగిన ముళ్లపొదలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ పరిస్థితిని గమనించిన హవర్గ మాజీ సర్పంచి భుజంగ్‌రావు శుక్రవారం హవర్గ నుంచి కిష్టాపూర్ వరకు రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలను తొలగింపజేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులకు ఇబ్బందులు తొలగిపోయాయి.



ఆర్కేపీలో ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు

అండర్-19 ఫుట్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: అండర్-19 ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక పోటీలను శుక్రవారం రామకృష్ణాపూర్ ఠాగూర్ మైదానంలో నిర్వహించారు. కళాశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన బాలుర జట్టును ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ బాబురావు తెలిపారు వచ్చే నెల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పీడీ రాజయ్య, శిక్షకుడు రవికుమార్, పీఈటీ సురేందర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్..

తాండూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన ఎం.అమూల్య ఎంపికైంది. అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో సత్తా చాటింది. అచ్చలాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అమూల్య 8వ తరగతి చదువుతుంది. ఈ నెల 28వ తేదీ నుంచి 30 వరకు గోదావరిఖనిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ఆడనుంది. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు బి.ఉమాదేవి, పీడీ సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా అభినందించారు.



ఎంపికైన విద్యార్థినితో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి

మంచిర్యాల క్రీడావిభాగం: మహబూబ్‌నగర్ జిల్లాలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రేణి రాజయ్య తెలిపారు. జిల్లాలో జరిగిన అండర్-19 బాలుర జోనల్‌స్థాయి పోటీల్లో కార్తీక్, వాగయ్య, ప్రణయ్ ప్రతిభ చాటి అర్హత సాధించారని చెప్పారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తాచాటేందుకు మరింత కసరత్తుకు సిద్ధమవుతున్నారని, జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా సాధన చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో పీడీ రాజయ్య

హాకీ పోటీలు ప్రారంభం

ఉట్నూరు: ఉట్నూరులోని కుమురం భీం మైదానంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలను ఐటీడీఏ డీడీ వసంత్‌రావు ప్రారంభించారు. గిరిజన విద్యార్థులు హాకీ క్రీడలో రాణించడం హర్షణీయమన్నారు. గిరిజన సంక్షేమశాఖ క్రీడాధికారులు పార్థసారథి, భుక్య రమేష్, హెచ్‌ఎం రాఠోడ్ ఉత్తం, ఏఎస్‌వో హేమంత్, పవార్ లక్ష్మణ్, కోచ్‌లు రవీందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు రాక.. భవనానికి తాళం

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి మండలం కన్నాలలోని శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన కల్యాణ మండపానికి గుత్తేదారు తాళం వేశారు. భక్తుల సౌకర్యం కోసం సుమారు రూ. 50 లక్షలు వెచ్చించి నిర్మించారు. పనులు పూర్తై రెండేళ్లు అవుతున్నా ఇంకా దేవాదాయ శాఖకు సదరు గుత్తేదారు అప్పగించనట్లు సమాచారం. ఇప్పటికీ పనులు కాకపోవడంతో ఇంకా పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాలేదు. ఆలయాధికారులు నిర్వాహకులు స్పందించి కార్యక్రమాలకు అప్పగించినట్లు సమాచారం. ఇప్పటికే పనులు కాకపోవడంతో గుత్తేదారు తనకు రావాల్సిన డబ్బులిస్తే కోట పడుతుందని తాళం వేసినట్లు తెలిసింది.



కల్యాణ మండపానికి తాళం వేసిన గుత్తేదారు

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు

మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆత్మహత్యలు, హత్యలు, దొంగతనాల వంటి నేరాలలో విశ్వసనీయంగా నేర పరిశోధన జరిపే ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ మంచిర్యాలలో ఏర్పాటు కానుంది.



నస్పూర్‌లో ఏర్పాటు చేసిన ల్యాబ్ కార్యాలయం

ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు మంచిర్యాలతో పాటు ఖమ్మంలో ఈ ల్యాబ్‌లను ప్రారంభించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. హత్య, హత్యాయత్నం, దోపిడీ కేసుల్లో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణం సంభవించిన మరణాల కారణం తెలుసుకోవడం కోసం వైద్యులు మృతుల రక్తం, ఇతర శరీర భాగాలను పరీక్షించి కరీంనగర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించేవారు. ఇకపై మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు సంబంధించిన కేసులతో పాటు పెద్దపల్లి జిల్లాలోని రామగుండం సబ్‌డివిజన్ కేసులు సైతం మంచిర్యాలలోని ల్యాబ్‌లోనే పరీక్షించనున్నారు. దీంతో కేసు పురోగతిలో వేగవంతం కానున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఆపన్నహస్తం.. మానవత్వపు నేస్తం



మళ్లీ..జీవాలను మేతకు తీసుకెళ్తున్న ఇనేష్

జీవితంపై పిడుగు దాతల గొడుగు..

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాంసింగ్ తండాకు చెందిన దివ్యాంగుడైన చవాన్ ఇనేష్ గొర్రెల మందే జీవనాధారం. ఎప్పటి లాగే వాటిని మేతకు తీసుకెళ్లగా ఇటీవల పిడుగుపడి 70 జీవాలు మృత్యువాత పడ్డాయి. రోజూ వాటిని మేపేందుకు వెళ్లే ఆ వ్యక్తికి తెల్లవారే పని లేకుండా పోయింది. దాదాపు రూ. 10లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఏం చేయాలో తెలియని దైన్యం. ఈ స్థితిలో సమీప తండాల్లోంచి మానవతామూర్తులు కదిలివచ్చారు. తలా ఒకటీ రెండు జీవాలను ఇనేష్‌కు ఇచ్చారు. పిడుగు పడి అతలాకుతలమైన ఆ బడుగు జీవిపై గొడుగు పట్టారు. 40 జీవాలను అందించి మళ్లీ ఆయనకు బతుకు దారి చూపించారు. ఒకరి కష్టాన్ని పది మంది పంచుకుంటే సమస్య ఎంత తేలికవుతుందో నిరూపించారు ఆ మంచి మను(సు)షులు..

సహజంగా ప్రతి మనిషికి ఏవో కష్టాలు వస్తూనే ఉంటాయి. వాటిని ఎదుర్కోలేని పరిస్థితుల్లో ఉన్న వారు అల్లాడుతుంటారు. అయ్యో నాకు ఇలా అయ్యిందేంటి అని బాధపడుతుంటారు. దేవుడా నన్ను గట్టెక్కించు అని వేడుకుంటారు. ఇలాంటి సందర్భాల్లో ఎవరైనా చేయూతనిస్తేనో.. చేతనైనంత సాయం చేస్తేనో ఊరట పొందుతారు. తాను కొలిచే దైవమే సాక్షాత్తూ కళ్ల ముందుకు వచ్చిందని ఆ మనిషిలో దేవున్ని చూస్తారు. మానవత్వం పరిమళించి తోటి వారి ఇబ్బందుల్లో పాలుపంచుకునే వారు ఎదుటి వారి గుండెల్లో గూడు కట్టుకుంటారు.

-న్యూస్‌టుడే, మామడ,

వా(హ్యా)ట్సాప్ గ్రూపులు..

సామాజిక మాధ్యమాలు విస్తృతమయ్యాక సాయమందించే ఆలోచన ఉన్న చేతులు ఒక్కటవుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆపన్న హస్తం అందించే వారు బయటకొస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లో 'రక్తదాతల' గ్రూపులు చేస్తున్న సేవలకు హ్యాట్సాప్ చెప్పాల్సిందే. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌లలో కనీసం రోజుకు 20 మందికి పైగానే వాట్సాప్ గ్రూపుల్లో చూసి అవసరమున్న వ్యక్తులకు అత్యవసరంగా వెళ్లి రక్తదానం చేస్తున్నారు.

- ఆకలిగా ఉన్న వారికి గుప్పెడు అన్నం, ఆపదలో ఉన్న వారికి కొంచెం సాయం, బాధలో ఉన్న వారికి ఓదార్పు అందించడం నిజమైన మానవత్వం.
- ఎదుటి మనిషి కన్నీరు తుడవడానికి బంధుత్వమో, రక్త సంబంధమో, పేగు బంధమో ఉండనక్కర్లేదు. పిడికెడు గుండెలో చిటికెడు మానవత్వం ఉంటే చాలు
- ఎన్ని మతాలున్నా అసలైన మతం మానవత్వం

ధన రాసులే ఉండక్కర్లేదు..

మానవత్వానికి కొలమానం డబ్బు మాత్రమే కాదు. ధనం దానం చేస్తేనే మేలు చేసినట్లు కాదు. ఎన్నో రకాలుగా మంచి చేయవచ్చు. ఒక్కోసారి మనం చేసే మాట సాయమే కొందరి జీవితాల్లో వెలుగులు నింపుతాయి. కింద పడిపోతున్న ఓ వ్యక్తిని పట్టుకోగలిగినా.. ప్రవాహంలో కొట్టుకుపోతున్న మనిషిని ఒడ్డుకు చేర్చగలిగినా, కారుమబ్బులు ఆవరించి కటిక చీకటిలా మారిన జీవితాల్లో వెలుగులను ప్రసరింప చేసే ఏ కార్యం చేసినా కాంతిమూర్తులవుతారు.

అభినందనీయం అభిమన్యు బృందం..

ఉట్నూరు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల వేదికగా ఏర్పాటైన 'అభిమన్యు వాట్సాప్ గ్రూపు' ఎన్నో సందర్భాల్లో ఆపదలో ఉన్న, అత్యవసరమైన వారికి అండగా నిలుస్తూ మానవత్వపు పరిమళాలు వెదజల్లుతోంది. దాదాపు పదేళ్ల క్రితం గాదిగూడ మండలం లోకారికి చెందిన శేఖర్‌బాబు ప్రారంభించిన ఈ గ్రూపులో 800 మంది సభ్యులున్నారు. వీరంతా కలిసి ఇప్పటి వరకు విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం రూ.లక్షల్లో సాయం చేశారు. అక్కడి మానవసేవయే మాధవ సేవ గ్రూపు సైతం సేవల్లో ముందుంటోంది.



చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సాయమందించి సన్మానిస్తూ..

బ్యాచ్‌మేట్లు..క్లాస్‌మేట్లు

ఆదుకునేందుకు రక్త సంబంధీకులు, బంధువులే కానక్కర్లేదని పరిచయస్తులు, మిత్రులైనా మేలు చేయొచ్చని నిరూపిస్తున్నారు చాలా మంది. కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు, ఒకేసారి కొలువు దక్కి ఒక చోట శిక్షణ పొందిన వారు ఎప్పటికీ కలిసుంటున్నారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు.

రూ.కోటి సాయం చేసి...

2014 సంవత్సరంలో ఎస్సైలుగా ఎంపికై ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న వారు ఓ సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తమ బ్యాచ్‌మేట్ల కష్టాలను పంచుకునేందుకు వారు చూపిస్తున్న మానవత్వం స్ఫూర్తిదాయకం. ప్రమాదాల్లో, ఇతర ఆరోగ్య సమస్యలతో మరణించిన తమ సహచరుల కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.కోటి వరకు సాయం చేశారంటే మాటలు కాదు. మేమంతా ఏడాదికి రూ.3 వేల సంక్షేమ సంఘానికి అందిస్తామని, అత్యవసరమైతే ఎక్కువ డబ్బులు తలా కొంత ఇస్తామని ఆ బ్యాచ్‌కు చెందిన లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపారు.



మరణించిన బ్యాచ్‌మేట్ కుటుంబానికి సాయమందిస్తూ..

మేమున్నామంటూ..


లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌లో 1997-98 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుల కష్టాల్లో పాలుపంచుకుంటున్నారు. మరణించిన ముగ్గురు క్లాస్‌మేట్ల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మరో ఇద్దరు స్నేహితుల వైద్యం కోసం రూ.45 వేలు అందించారు. ఇలా ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా అండగా నిలుస్తున్నారు.



మిత్రుని కుటుంబానికి ఆసరానిస్తూ..

గుస్సాడీకి జీవం పోసిన కనకరాజు

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, జైనూర్: : రాజ్‌గొండ్‌ల ప్రాచీన విశిష్ట కళ గుస్సాడీ నృత్యం. తలపై నెమలి ఈకలతో అల్లిన టోపి, చేతిలో దండారి, కాళ్లకు గజ్జలు, జంతువుల చర్మంతో చేసిన వస్త్రాలతో పురి విప్పిన నెమలిలా కనకరాజు గుస్సాడీ నృత్యం చేస్తే చూసేందుకు రెండుకళ్లూ చాలవు. ఇందులో ప్రావీణ్యం సంపాదించిన ఆయన ఆదివాసీల నృత్యకళకు జీవం పోశారు. దేవతామూర్తులను ఆరాధించే దండారీ నుంచే స్ఫూర్తి పొంది గుస్సాడీని నేర్చుకున్నానని పలు సందర్భాల్లో పేర్కొన్నారు. చుట్టు పక్కల పరిసరాల గిరిజనులు ఈయనను ఆదినుంచి కనకరాజుగా కాకుండా గుస్సాడీ రాజుగానే పిలిచేవారు. ఆయన మృతితో ఆదివాసులు శోకసంద్రంలో మునిగారు



ఇందిరాగాంధీ పక్కన (ఎడమ నుంచి మొదటి వ్యక్తి) కనకరాజు

ఇందిరాగాంధీ ముందు ప్రదర్శన

1982లో దేశరాజధాని దిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు ప్రదర్శన ఇచ్చారు. అప్పటి ఆదివాసీ, ఉట్నూరు ఐఏఎస్ అధికారి తుకారం సిర్పూరు మండలంలోని పిట్టగూడ గ్రామంలో దండారీ (గుస్సాడీ) ఉత్సవాల్లో నైపుణ్యంలో వీరికి శిక్షణ ఇప్పించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన కనకరాజుతోపాటు సార్మేడీ మెస్రం దుర్గారావును దిల్లీకి పంపించారు. కనకరాజు నృత్యాన్ని చూసి ఇందిరాగాంధీ ముగ్ధురాలుకాగా, ఆమె కాలికి కనకరాజు గజ్జెలు కట్టడంతో ప్రధాని సైతం వీరితో పాదం కలిపారు. 2002లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం ముందు చేసిన గుస్సాడీ నృత్యానికి ఆయనను అభినందించారు. ఇప్పటి వరకు 350 పైగా ప్రదర్శనలు ఇచ్చారు. వందలాది మంది ఉత్సాహవంతులైన గిరిజనులకు ఈ నృత్యంలో తర్ఫీదునందించారు. తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి ఆదివాసీ కళాకారునిగా చరిత్రకెక్కారు. కనకరాజుకు ఇద్దరు భార్యలు ఉండగా, నలుగురు కొడుకులు, ఏడుగురు కూతుళ్లు ఉన్నారు.



గుస్సాడీ కళాకారులకు శిక్షణ ఇస్తున్న కనకరాజు



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న కనకరాజు

పోరాటయోధుడు కుమురం భీం మరణం తరువాత నిజాం మానవ పరిణామ శాస్త్రవేత్త హేమన్‌డార్ఫ్‌ను గిరిజనుల స్థితిగతులు తెలుసుకోవడానికి జిల్లాకు పంపించారు. హేమన్‌డార్ఫ్ కొన్ని సంవత్సరాలపాటు మర్లవాయిలోనే ఉన్నారు. ఆదివాసీలతో మమేకమై వారి జీవన విధానం, కావాల్సిన మౌలిక సౌకర్యాలను అధ్యయనం చేశారు. ఈ సమయంలో కనకరాజు ఈయనతోనే ఎక్కువ సమయం గడిపేవారు. బాలుడి నుంచి యువకుడి వరకు హేమన్‌డార్ఫ్‌తో కలిసి ఉన్నానని పలు సందర్భాల్లో తెలిపారు.

ఎమ్మెల్యే శంకర్‌కు తప్పిన ప్రమాదం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పాయల్ శంకర్ త్రుటిలో ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. మూసీ బాధితులకు అండగా భాజపా హైదరాబాద్‌లో శుక్రవారం చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిలాబాద్‌లో రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకుని హుటాహుటిన బయలుదేరారు. మార్గమధ్యలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఎక్స్‌రోడ్డు సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఎమ్మెల్యే వాహనాన్ని ఢీకొట్టింది. వెనక అద్దాలు పగిలాయి. ఆ సమయంలో ఎమ్మెల్యేతో పాటు పీఏ మనోజ్‌పవార్, డ్రైవర్ నవీన్ ముగ్గురే పయనిస్తున్నారు. వెనుక సీటులో కూర్చున్న మనోజ్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. రెండు వాహనాల వేగం తక్కువగా ఉండటంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద విషయం తెలిసి ఎమ్మెల్యే బంధువులు, అభిమానులు అంతా హైరానా చెందారు. ఎమ్మెల్యే తనకేం కాలేదని వీడియో సందేశం విడుదల చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. రాత్రి ఆదిలాబాద్‌కు చేరుకున్న ఎమ్మెల్యే నేరుగా మార్కెట్‌యార్డుకు చేరుకుని పాలనాధికారి రాజర్షిషా సమక్షంలో వ్యాపారులు, రైతులతో జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.



పగిలిన వాహన అద్దాలు

28న పీఎఫ్ మీ ముంగిట

చైతన్యపురి, న్యూస్‌టుడే : కరీంనగర్ భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈనెల 28న పీఎఫ్ మీ ముంగిట (నిధి ఆప్కే నికత్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ సెల్వత్కర్ తానయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అవగాహన కల్పించి, భవిష్యనిధి సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

జిల్లా	కార్యక్రమం జరిగే ప్రదేశం
ఆదిలాబాద్:	నలంద డిగ్రీ కళాశాల సమావేశ గది
మంచిర్యాల:	కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్
కుమురంభీం:	సిర్పూర్ కాగజ్‌నగర్ శ్రీకృష్ణవేణి హైస్కూల్
నిర్మల్ :	ఇబ్రహీంబాగ్ రవి ఉన్నత పాఠశాల

ఇంతి.. సింగరేణి కాంతి



శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పురుషాధిక్యం ఉన్న సింగరేణిలో మహిళా ఉద్యోగులకు తమ ఉనికిని చాటుకునేందుకు అవకాశం లభించింది. సంస్థలో కారుణ్య నియామకాలు మొదలైన తర్వాత ఉద్యోగాల్లో చేరుతున్న మహిళల సంఖ్య పెరుగుతోంది. వీరిలో ఉన్నత విద్య అభ్యసించిన వారు చాలా మంది ఉన్నారు. వీరందరూ సాధారణ ఉద్యోగులు(జనరల్ మజ్దూర్)గా తమ సేవలు అందిస్తున్నారు. భూగర్భ గనుల్లో వీరు విధులు నిర్వర్తించేందుకు అవకాశం లేకపోవడంతో వీరి సేవలు సంస్థ కార్యాలయాల్లోనే వినియోగించుకుంటున్నారు. సంస్థలో ప్రస్తుతం మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతుండటంతో వీరిని ఉపరితలంలోనే 16 రకాల సేవలు వినియోగించుకోవాలని యాజమాన్యం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేట్, ఏరియా స్థాయిల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ విద్యార్హత ఆధారంగా ఉద్యోగినులు ఎంచుకున్న పనులపై శిక్షణ ఇవ్వనుంది.

● 16 రకాల పనులు ఎంచుకునే అవకాశం..

ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శించేందుకు..

కన్వేయర్ ఆపరేటర్, పంపు ఆపరేటర్, వాల్వ్ ఆపరేటర్, చార్జర్ సేఫ్టీ ల్యాంప్, ల్యాంప్ రూం ఫిట్టర్, కుక్, వెండార్, సర్వే మజ్దూర్, స్టోర్స్ ఇష్యూ మజ్దూర్, బైండర్, శాంప్లింగ్ మజ్దూర్, ఈపీ గ్రీసర్, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్ వంటి ముఖ్యమైన పనులు ఉన్నాయి. వీటిలో వారు ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శిస్తే మంచి గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగినులు ఎంచుకున్న పనులపై శిక్షణ ఇచ్చి తర్వాత ఆయా పనులు కేటాయిస్తుంది. ఆయా కేటగిరీల్లో అంతర్గత పరీక్షలు రాసి ఉన్నత స్థితికి చేరుకునే అవకాశముంది. ఉన్నత విద్య అభ్యసించి కార్యాలయాల్లో అటెండర్లుగా పని చేసిన వారు ఇకపై సాంకేతిక పరమైన పనుల్లో ప్రతిభ చాటుకునేందుకు వీలు ఏర్పడింది.



కాసిపేట గనిపై కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కాసిపేట: కాసిపేట గనిలో మహిళా ఉద్యోగులకు ఖాళీగా ఉన్న వివిధ శాఖల ఉద్యోగాలకు శిక్షణ అనంతరం ఉద్యోగం కల్పిస్తామని ఎస్‌వోటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఖాళీగా ఉన్న 16 ఉద్యోగాల కోసం మహిళా ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంచుకున్న ఉద్యోగానికి ముందుగా ఉద్యోగులకు శిక్షణ ఇస్తామన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎంఐఈడీ రాజన్న, వైద్యురాలు భవాని, రామదాసు, భూశంకరయ్య ఉన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌గా దివ్య

శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో జనరల్ మజ్దూర్ ఉద్యోగిని బి.దివ్య కంప్యూటర్ ఆపరేటర్‌గా సేవలు అందిస్తున్నారు. 2022లో సంస్థలో చేరిన ఆమె ఎంఎస్సీ(మ్యాథమేటిక్స్) పూర్తి చేశారు. విద్యార్హత మేరకు అధికారులు ఆమెకు విధులు కేటాయించారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా దివ్య సంస్థకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. మహిళా ఉద్యోగులు యాజమాన్యం సూచించిన పనుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆమె చెబుతున్నారు.




ఫైళ్ల కూర్పులో నేర్పరి

ఏరియాలోని సీహెచ్‌పీలో బదిలీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గుడికందుల స్వప్న 2023లో సంస్థలో చేరారు. ఎంబీఏ(హెచ్‌ఆర్‌ఎం) పూర్తి చేసిన ఆమె కార్యాలయంలో చురుకైన పనులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు, సంస్థకు చెందిన ఫైళ్లను భద్రపర్చడం, వాటిలో ఏవైనా పెండింగ్ సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. యాజమాన్యం సూచించిన పనుల్లో కార్యాలయ అటెండెంట్ ముఖ్యమైన పనే అని స్వప్న అంటున్నారు.



ఈ సన్నాలకే బోనస్



సాగవుతున్న సన్న రకాలు

నిర్మల్, న్యూస్‌టుడే: సన్నరకం ధాన్యం క్వింటాలుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు అన్నదాతల్లో నెలకొన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం 33 సన్నరకాలు గుర్తించింది. సన్నరకం గింజ పొడువు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, మందం 2 మిల్లీమీటర్ల కంటే ఉండాలని ప్రమాణాలు నిర్దేశించింది. ఆ వంగడాలు ఇవే..

సిద్ధి	(డబ్ల్యూజీఎల్-44)
కంపసాగర్-1	(కేపీఎస్-2874)
సాంబమసూరి	(బీపీటీ-5204)
జగిత్యాల-3	(జేజీఎల్27356)
జగిత్యాల-2	(జేజీఎల్285545)
వరంగల్ సాంబ	(డబ్ల్యూజీఎల్-14)
వరంగల్ సన్నాలు	(డబ్ల్యూజీఎల్-32100)
జగిత్యాల మసూరి	(జేజీఎల్-11470)
పొలాస ప్రభ	(జేజీఎల్-384)
కృష్ణ	(ఆర్ఎన్ఆర్-2458)
మానేరు సోనా	(జేజీఎల్-3828)
తెలంగాణ సోనా	(ఆర్ఎన్ఆర్-15048)
వరంగల్ వరి	-1119
కూనారం వరి-1	(కేఎన్ఎం-733)
కూనారం వరి-2	(కేఎన్ఎం-1638)
వరంగల్ వరి-2	(డబ్ల్యూజీఎల్-962)
రాజేంద్రనగర్ వరి-4	(ఆర్ఎన్ఆర్-21278)
జగిత్యాల సన్నాలు	(జేజీఎల్-1798)
జగిత్యాల సాంబ	(జేజీఎల్-3844)
కరీంనగర్ సాంబ	(జేజీఎల్-3855)
అంజన	(జేజీఎల్-11118)
నెల్లూరి మసూరి	(ఎన్ఎల్ఆర్-34449)
ప్రత్యూమ్న	(జేజీఎల్-17004)
సుగంధ సాంబ	(ఆర్ఎన్ఆర్-2354)
శోబిని	(ఆర్ఎన్ఆర్-2354)
సోమనాథ్	(డబ్ల్యూజీఎల్-347)
ఆర్ఎన్ఆర్	-31479 (పీఆర్‌సీ)
కేపీఎస్	-6251 (పీఆర్‌సీ)
జేజీఎల్	-33124(పీఆర్‌సీ)
హెచ్‌ఎంటీ సోనా	
మారుటేరు సాంబ	(ఎంటీయూ-1224)
మారుటేరి మసూరి	(ఎంజీయూ-1262)
ఎంటీయూ-1271	